క్లుప్తంగా

నీటి ఎద్దడి లేకుండా చూడాలి



వాటర్‌వర్క్స్ విభాగాన్ని తనిఖీ చేస్తున్న కమిషనర్

నరసాపురం: వార్డుల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలో ప్రధాన రక్షిత మంచినీటి సరఫరా విభాగాన్ని కమిషనర్ తనిఖీ చేశారు. మంచినీటి చెరువులో నీరు ఎంతమేర ఉంది, ఆలం నిల్వలు తదితర అంశాలను పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతిరోజూ క్లోరినేషన్ సవ్యంగా నిర్వహించాలన్నారు. అన్ని వార్డులకు నీరు సవ్యంగా చేరేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఆయన వెంట డీఈఈ ప్రవీణ్‌చంద్ర, ఏఈ కిషోర్ ఉన్నారు.

ఘనంగా తిరునక్షత్ర ఉత్సవాలు



శ్రీ ఎంబెరుమనార్ స్వామివారిని ఊరేగిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: నరసాపురంలోని శ్రీ ఆదికేశవ ఎంబెరుమనార్ (కోవెల) ఆలయంలో స్వామివార్ల తిరునక్షత్ర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివార్ల ఉత్సవ విగ్రహాలకు తిరుమంజనం, లీలా విభూతి ఉత్సవం, రాజాధిరాజ వాహనం, పల్లకీలో అగ్రహార ఉత్సవం తదితర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు కిలాంబి వెంకటాచార్యులు ప్రవచనాలు భక్తులకు ఉపన్యసించారు. అర్చకులు సుదర్శన శేషాచార్యులు, పెద్దింటి రామ్మోహనాచార్యులు, శ్రీనివాసుల రామకృష్ణ ఆధ్వర్యంలో పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు 'కథా కుసుమాలు' ఆవిష్కరణ

నరసాపురం రూరల్: నరసాపురం అల్లూరి సత్యనారాయణ రాజు సాంస్కృతిక కేంద్రంలో శనివారం కథా కుసుమాలు కథల సంకలనం ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు పుస్తక రూపకర్త ప్రముఖ రచయిత పాకోడేటి సత్యనారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. మరి కొందరు రచయితలు రచించిన పుస్తకాలను కూడా ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. ప్రముఖ రచయితలు పాలకోడేటి సోదరులు, డాక్టర్ సుగుణరావు, వల్లీశ్వర్, నమ్మి కనక నాగేశ్వరరావు, సరసి, బాలం వెంకట్రావు, హనుమంతరావు, డాక్టర్ గాదిరాజు రంగరాజు, తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగే ఈ కార్యక్రమంలో జిల్లాలోని సాహితీ ప్రియులు హాజరు కానున్నారని వివరించారు.

ఎంపీడీఓ కార్యాలయంలో అగ్నిప్రమాదం

పాలకొల్లు (సెంట్రల్): పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయంలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కావడంతో శుక్రవారం విద్యుత్తు మీటరు ఉన్న గదిలో మంటలు వచ్చాయి. దీంతో సిబ్బంది భయాందోళనతో బయటకొచ్చారు. విద్యుత్తు శాఖ సిబ్బంది ఘటన స్థలంలో ఉండడంతో ప్రధాన తీగలను కత్తిరించడం, అగ్నిమాపక వాహనం రాకముందే సిబ్బంది ఇసుకతో మంటలను ఆర్పివేశారు. విద్యుత్తు శాఖ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. వోల్టేజ్ అధికమై మీటరుపై ఒత్తిడి పెరిగి దగ్ధమైందన్నారు.

భూసారానికి నవధాన్యాల సాగు



రైతులకు నవధాన్యాల కిట్లు అందిస్తున్న వెంకటేశ్వరరావు

నరసాపురం రూరల్: ప్రతి ఒక్కరికీ సురక్షిత ఆహారం, మంచి ఆరోగ్యం కోసం నవధాన్య పంటల వ్యవస్థలకు ప్రభుత్వం సబ్సిడీపై సబ్సిడీపై విత్తనాలు అందిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం నరసాపురం మండలం నవరసపురం గ్రామంలో ఏపీ ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు నవధాన్యాల కిట్లు అందించారు. తొమ్మిది కిలోల కిట్‌ను రూ.800కే అందించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ ఈదా అనిల్‌కుమారి, ఏఓ శ్యామ్యూల్ జాన్సన్, పకృతి వ్యవసాయ సిబ్బంది, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ముస్లింల ర్యాలీ

పాలకొల్లు(సెంట్రల్): పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా పాలకొల్లులో ముస్లింలు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. పట్టణం మెయిన్ రోడ్డు పెద్ద మసీదు నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు ముస్లింలు ర్యాలీ మానవహారం చేశారు.

ప్రమాదపుటంచున ప్రయాణం

- కల్వర్టుల వద్ద రక్షణ కరువు
- బిక్కుబిక్కుమంటూ వాహనచోదకుల రాకపోకలు

పెనుగొండ: రోడ్డు కల్వర్టుల వద్ద రక్షణ కరువైంది. వాటికి ఇరువైపులా గోడలు లేకపోవడంతో ఆయా ప్రాంతాల్లో వాహనచోదకులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. ఏ మాత్రం ఆదమరిచినా డ్రెయిన్లలోకి బోల్తాపడక తప్పని పరిస్థితి ఉంది. పెనుగొండ – సిద్ధాంతం రహదారి విస్తరణ పనుల్లో రోడ్డు మార్జిన్లు, కల్వర్టుల వద్ద రక్షణ చర్యలు చేపట్టలేదు. సిద్ధాంతం పంచాయతీ వద్ద గరగాలమ్మ డ్రెయినేజీ వద్ద కల్వర్టుకు రక్షణ గోడలు లేవు. పెనుగొడ పంచాయతీ సమీపంలోనే గరగాలమ్మ డ్రెయిన్ ప్రవహిస్తోంది. రాత్రి వేళల్లో డ్రెయిన్ కల్వర్టుపై



సిద్ధాంతం పంచాయతీ సమీపంలో గోడల్లేని కల్వర్టు

ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో వాహనచోదకులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇదే పరిస్థితి చెరుకువాడలోనూ ఉంది. రహదారి విస్తరణలో భాగంగా సీసీ రోడ్డు నిర్మించారు. మురుగు డ్రెయిన్‌కు కనీస మార్జిన్ లేకుండా రోడ్డు నిర్మించారు. దీంతో రోడ్డు అంచులు ప్రమాదకరంగా మారాయి. ఇదే ప్రాంతంలో మలుపు తిరిగి ఉండడంతో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా నేరుగా మురుగు డ్రెయిన్‌లోకి పడిపోవడం ఖాయం. పెనుగొండ – మార్టేరు రహదారిలోనూ శ్రీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయం వద్ద లక్ష్మీ జనార్ధన స్వామి కల్యాణ మండపాన్ని ఆనుకొని ప్రవహిస్తున్న ఆచంట ఓల్డ్ చానల్‌కు ఉన్న కల్వర్టుకు ఎటువంటి రక్షణ గోడలు లేవు. దీంతో చీకటి వేళ ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇదే ప్రాంతంలో ఉన్న కళాశాల వద్ద నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించబోయి పంట కాలువలోకి వాహనచోదకులు దూసుకుపోయే ప్రమాదం నెలకొంది. అధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.



పెనుగొండ - సిద్ధాంతం రహదారిలో మార్జిన్ లేని ప్రధాన రహదారి



పెనుగొండలో వాసవీ మాత ఆలయం వద్ద ప్రమాదకర కల్వర్టు

ముస్లింల శాంతి ర్యాలీ



అంబేడ్కర్ సెంటర్‌లో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

నరసాపురం: పహల్గాంలో మారణహోమం సృష్టించిన పాకిస్తాన్ ముష్కరుల అంతం చూడాలని నరసాపురం అంజుమన్ సంఘ పెద్దలు అన్నారు. అమాయకులైన టూరిస్టులను పొట్టనపెట్టుకున్న తీవ్రవాదుల ఘాతుకానికి వ్యతిరేఖంగా పట్టణంలో శుక్రవారం రాత్రి పట్టణంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ చేశారు. పంజాసెంటర్ నుంచి ప్రకాశం రోడ్డు మీదుగా అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. అంబేడ్కర్ సెంటర్‌లో అంజుమన్ సంఘ అధ్యక్షుడు షేక్ బులిమస్తాన్, షేక్ సిలార్‌సాహెబ్, ఎండీ మౌలాలీఖాన్ మాట్లాడుతూ భారతదేశంలో జీవించేందుకు ప్రతి ముస్లిం గర్వపిస్తాడని అన్నారు. ఇతరులను హింసించవద్దని ఖురాన్ ప్రభోదిస్తుందని అన్నారు. ఖురాన్ సారానికి వ్యతిరేఖంగా పాకిస్తాన్ ముష్కరులు చేసిన ఘాతుకం మహాపాపమని తెలిపారు. వందేమాతరం, జై భారత్‌నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో అంజుమన్ సంఘ పెద్దలు షేక్ సిలార్ సాహెబ్, దావూద్‌ఖాన్, ఖాజా అమీన్, ఖాజీ ఇమ్రాన్, ఎండీ మెహిద్దీన్, ఎండీ బాషాఖాన్ నాయకత్వం వహించారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌తో పాటుగా వివిధ రాజకీయపార్టీల నేతలు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు.

మందాలమ్మ గ్రామోత్సవం



వడలి గ్రామ దేవత మందాలమ్మ గ్రామోత్సవం

పెనుగొండ: వడలి గ్రామ దేవత మందాలమ్మ గ్రామోత్సవం గురువారం కనుల పండుగగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం నుంచి అమ్మవారికి పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక రథంపై ఉంచి కేరళ వాయిద్యాలు, బుట్టబొమ్మల విన్యాసాలు, బ్యాండ్ మేళం బాణసంచా కాల్పులతో గ్రామోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్తులు పసుపు నీళ్లతో గ్రామోత్సవానికి స్వాగతం పలికారు.

వెండి కవచ తయారీకి విరాళం

మందాలమ్మ అమ్మవారికి వెండికవచం తయారీకి సిద్ధాంతంకు చెందిన మామిడిశెట్టి నాగరాజు, దేవి దంపతుల కుమారుడు ఆర్యమన్, కుమార్తెహరి ప్రియలు రూ.11116 విరాళంగా అందించారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

పార్టీకి మంచిపేరు వచ్చేలా పనిచేయాలి



నూతన కన్వీనర్లను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గోపి



కలగంపూడిలో స్టాలిన్‌బాబును అభినందిస్తున్న బుచ్చిరాజు

వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గోపి

యలమంచిలి: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉంచిన నమ్మకానికి సార్థకత చేకూరుస్తూ ప్రజల్లో పార్టీకి మంచి పేరు వచ్చేలా పనిచేయాలని ఆ పార్టీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) సూచించారు. పార్టీ పాలకొల్లు పట్టణ, మండల, యలమంచిలి, పోడూరు మండలాల కన్వీనర్లుగా నియమితులైన కోరాడ శ్రీనివాసరావు, పెన్మెత్స ఏసురాజు, ఉచ్చుల స్టాలిన్‌బాబు, కొప్రపాటి వీరాస్వామిలను శుక్రవారం పాలకొల్లు పార్టీ కార్యాలయంలో పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కారని విమర్శించారు. స్థానిక మంత్రి రామానాయుడు ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి ప్రత్యర్థులపై రాజకీయ కక్ష సాధింపుల్లో బిజీగా ఉన్నారని ఆక్షేపించారు. కూటమి నాయకుల అవినీతిని, అసమర్థతను ప్రజలకు వివరించడం ద్వారా పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేయాలని నూతన కన్వీనర్లను కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చిలువూరి కుమార దత్తాత్రేయవర్మ, బొంతు వెంకట కర్ణారెడ్డి, జోగాడ ఉమామహేశ్వర రావు, కల్యాణం గంగాధరరావు, గణపాబత్తుల ఏసుబాబు, మంద హరికుమార్, కుక్కల రామకృష్ణ, వీరా ఉమా శంకర్, పోలుకొండ వెంకట్, కడిమి బాలరాజు, పీతాని శ్రీనివాస్, మామిడిశెట్టి చిట్టిబాబు, ఇనుకొండ చిన్న, గుడాల సురేష్, మోకా ప్రేమ్‌చంద్, కుక్కల బాలచంద్రన్, సిర్రా నాగరాజు, లంకే శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పని చేసేవారికే గుర్తింపు

కష్టపడి పని చేసిన వారికి పార్టీలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా ఉచ్చుల స్టాలిన్‌బాబు నియామకంతో రుజువైందని పార్టీ మండల మాజీ కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు అన్నారు. పార్టీ మండల కన్వీనర్‌గా నియమితులైన సందర్భంగా స్టాలిన్‌బాబు శుక్రవారం కలగంపూడి వెళ్లి బుచ్చిరాజును మర్యాద పూర్వకంగా కలిశారు. బుచ్చిరాజు స్టాలిన్‌బాబుకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముదునూరి ప్రసాదరాజు, పాలపర్తి సందీప్, వీరా ఉమాశంకర్, బొంతు వెంకట కర్ణారెడ్డి, కల్యాణం గంగాధరరావు, కల్యాణం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

స్టాండ్లు లేక రోడ్లపైనే ఆటోల పార్కింగ్

తరచూ రోడ్డు ప్రమాదాలు

నరసాపురం: పట్టణంలో ఆటోల నిలుపుదలకు ప్రత్యేక స్థలాలులేవు. దీంతో ఆటోలను ఇష్టానుసారం రోడ్లపైనే నిలిపివేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మితిమీరిన వేగంతో ఆటోల డ్రైవింగ్, కనీస వయస్సులేని పిల్లలు సైతం ఆటోలు నడుపుతుండడం ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నరసాపురం పట్టణంలో దాదాపు 400 పైగా ఆటోలున్నాయి. ఆటోల పార్కింగ్‌కు ప్రత్యేకంగా స్థలాలు లేకపోవడంతో సమస్య తలెత్తింది. నిత్యం రద్దీగా ఉంటే బస్టాండ్, గుర్రపు బండ్ల స్టాండ్, ఎండు చేపల మార్కెట్, కొత్తగా గడ్డిబజార్ సెంటర్, కనకదుర్గ ఆలయం ప్రాంతాల్లో ఆటోలను రోడ్లపైనే నిలిపేయడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. బస్టాండ్, గుర్రపు బళ్ల స్టాండ్‌వద్ద ఆటోల నిలుపుదలతో తరచూ ప్రమాదాలు సంభ విస్తున్నాయి. ఈ ప్రాంతాల్లోనే



మొగల్తూరు రోడ్డుపై నిలిపి ఉంచిన ఆటోలు

గత రెండేళ్లలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా సంభవించాయి. ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులు ఇస్తామని, కనీస వయస్సు లేనివారు ఆటోలను నడపకుండా చర్యలు తీసుకుంటామని పోలీస్‌శాఖచేసిన ప్రకటన అమలుకు నోచు కోవడంలేదు. ఆటోలకు ప్రత్యేకంగా స్టాండ్ లేకపోవడంతో, ఎక్కడబడితే అక్కడ నిలిపి ఉంచుతున్నా రు. ఇప్పటికైనా పోలీస్‌శాఖ దృష్టిపెట్టి సమస్యను పరిష్కరించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

రఘురామ వ్యాఖ్యలు దారుణం

పెనుగొండ: ప్రజా నేత, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై డెప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలకు శుక్రవారం పెనుగొండలో సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. రఘురామ కృష్ణంరాజు తన వ్యాఖ్యలను సత్వరం వెనక్కి తీసుకోవాలని సీపీఎం పెనుగొండ మండల కార్యదర్శి షేక్ పాదుషా డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యుడు ఎస్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో పెద్దల కొమ్ము కాస్తూ పేదల ఇళ్లను పోలీసులను పెట్టి ధ్వంసం చేయడాన్ని ప్రశ్నిస్తే.. దుర్మార్గపు వ్యాఖ్యలు చేయడం దారుణమని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు నాగిశెట్టి గంగరావు, కప్పల రత్నంరాజు, నీలాపు ఆదినారాయణలు పాల్గొన్నారు.

ఆచంటలో..

భూస్వాముల ఆధీనంలో ఉన్న భూములను వదలి, నిరుపేదల ఇళ్లను కూల్చడం దుర్మార్గపు చర్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కేతా గోపాలన్ విమర్శించారు. రఘురామ కృష్ణంరాజు వ్యాఖ్యలపై ఆచంటలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పి.మోహన్‌రావు, మండల కమిటీ సభ్యుడు తలుపూరి బుల్లబ్బాయి, ఎస్‌వీఎస్ శర్మ, సిర్రా నరసింహమూర్తి, సీనియర్ నాయకులు బండి రంగారావు, తోటపల్లి సత్యనారాయణలు పాల్గొన్నారు.



పెనుగొండ : నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు



పెనుమంట్ర : బ్రాహ్మణచెర్వు సెంటర్‌లో సీపీఎం నాయకుల నిరసన

బ్రాహ్మణ చెర్వు సెంటర్‌లో నిరసన

పెనుమంట్ర: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుపై ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను సీపీఎం మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. బ్రాహ్మణ చెర్వు సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి కోడి శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్ల విధ్వంసానికి వ్యతిరేకంగా సీపీఎం చేస్తున్న న్యాయ పోరాటంపై డిప్యూటీ స్పీకర్ ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు స్పందించిన తీరు దారుణమని అన్నారు. ఇళ్లులేని పేదలకు ఇళ్లు నిర్మించాల్సిన ప్రభుత్వం పేదల ఇళ్లు కూల్చడమే పనిగా పెట్టుకుందని ఆరోపించారు. పార్టీ మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు మాట్లాడుతూ కాల్వ గట్టుపై ఉన్న పేదల ఇళ్ల నుంచి మంచినీరు కలుషితం అవుతుందని చెప్పడం విడ్డూరంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యురాలు కేతా పద్మజ, రాపాక ఆశీర్వాదం, తేనేటి ఆంజనేయులు, చింతపల్లి అప్పారావు, మాదాసు లక్ష్మణరావు, జోగి శ్రీను, కె.ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



పెనుగొండ : ఆచంటలో సీపీఎం నాయకుల నిరసన

మలేరియా అంతం మనతోనే

పాలకొల్లు (సెంట్రల్): మలేరియా అంతం మనతోనే అనే నినాదంతో లంకలకోడేరులో ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ మలేరియా అంతానికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలని, ఖాళీ కొబ్బరిబొండాలు, ప్లాస్టిక్ టైర్లు, ప్లాస్టిక్ మగ్గులు, పూల కుండీలు, ఫ్రిజ్‌లు, ఎయిర్ కూలర్లలో నీరు నిల్వ లేకుండా చూసుకుని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటిస్తూ దోమల నివారణ కు కృషి చేయాలని కోరారు. డాక్టర్ ఎం నవ్య జీవన్, ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు, పీహెచ్‌ఎన్ పి.ఎలిజిబెత్, ఇన్‌చార్జి సబ్ యూనిట్ అధికారి వై.బాలచంద్రుడు, సూపర్వైజర్లు జి.ఉదయ్ చందర్, ఎస్‌కే అమలేశ్వరావు, ల్యాబ్ టెక్నీషియన్లు సీహెచ్ సత్యప్రసాద్, కె.వర ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



మలేరియా అంతం మనతోనే అంటూ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయం

పాలకొల్లు(సెంట్రల్): స్థానిక బీఆర్‌ఎంహెచ్ స్కూల్ 1981 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సంఘం చేస్తోన్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఆర్డీఓ దాసిరాజు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సంఘం ఆధ్వర్యంలో గత 20 ఏళ్లపైగా సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌ల పంపిణీ, కోవిడ్ సమయంలో అన్నదానం, నిత్యావసర సరుకుల పంపిణీ చేయడం ఆదర్శణీయమని తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పట్టం గణేష్, కార్యదర్శి కేవీ సాంబశివరావు, వాకలపూడి బాబ్జి, పిల్లా శ్రీనివాస్, గిరిజాల శ్రీనివాస్, ఆర్ రాజు, వెంకటేశ్వరరావు, డి.నాగలింగేశ్వరరావు, గంటా శ్రీనివాస్, పి.సత్యనారాయణ, జి.కేదారేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఆర్డీఓ దాసిరాజు

పాఠశాల విద్యార్థికి ఘన సత్కారం



వడలి జెడ్పీ పాఠశాల విద్యార్థి అన్వేష్‌కు సత్కారం

పెనుగొండ: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండల ప్రథమ స్థానంలో నిలిచిన వడలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వీరవాసరపు భాస్కర్ అన్వేష్‌ను గురువారం వడలిలో ఘనంగా సత్కరించారు. మందాలమ్మ జాతర మహోత్సవాలు సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పాఠశాలలో ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన ఆకాశపు యామిని, మిడతాని సురేష్‌లను సత్కరించారు. కార్యక్రమంలో ఎస్సై కొప్పిశెట్టి గంగాధరరావు, ప్రధానోపాధ్యాయుడు బీఎల్ నరసింహమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ వార్షిక ప్రణాళిక

పాలకొల్లు (సెంట్రల్): స్థానిక పాలకొల్లు మండలం వాలమూరు గ్రామంలో కేపీపీ 2025–26 ప్రణాళిక కింద గ్రామస్థాయి పద్ధతి వ్యవసాయ ప్రచార కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి అప్పారావు కేపీపీ ముఖ్య ఉద్దేశం, లక్ష్యాలపై అవగాహన కల్పించారు. నవధాన్యాలు 5 రకాలు జాతులు ఉంటాయని పప్పుజాతి, పచ్చిరొట్ట, చిరు ధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, కూరగాయలు ఉంటాయని, 14 రకాల నవధాన్యాలు ఉంటాయని వివరించారు. మోడల్ మండల్ టీం లీడర్ మురళీకృష్ణ వార్షిక ప్రణాళికను వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల వాతావరణం మార్పులు గురించి రానున్న రోజుల్లో యూరియా డీఏపీలు ఉండవని, ప్రకృతి వ్యవసాయం ఉద్యమంగా మారుతుందని వివరించారు. నవధాన్యాల్లో ఉండే సైన్స్ నత్రజని, పొటాషియం భూమికి మేలని అన్నారు. వేసవిలో నవధాన్యాలు వేయడం వల్ల ఉష్ణోగ్రతలు సమానంగా ఉండవచ్చని వివరించారు. 43 దేశాల్లో వాతావరణ మార్పు కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో జరిగే ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మగ్గుచూపుతుతున్నట్టు చెప్పారు. గ్రామ సర్పంచ్ గంటా సత్యనారాయణ మాట్లాడుతూ నవధాన్యాల సాగు విస్తరణలో భాగంగా నవధాన్యాలను సబ్సిడీపై ఇస్తున్నట్టు చెప్పారు. ప్రకృతి వ్యవసాయ పంటకు మార్కెటింగ్ కల్పించాలని అడిగామన్నారు. ప్రకృతి వ్యవసాయంలో పండించిన ధాన్యం రేటు ఎక్కువ ధర ఇవ్వాలని చెప్పామని తెలిపారు. మహిళా సంఘాల ప్రెసిడెంట్ ఆదిలక్ష్మి గ్రామంలో ఖాళీ స్థలాల్లో ప్రకృతి వ్యవసాయ మోడల్స్ వేయాలని సూచించారు. ఈ సందర్భంగా గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు సరిల్లా నరసింహమూర్తిని సన్మానించారు. వారు ప్రకృతి వ్యవసాయంలో అనుభవాలను వివరించారు. అనంతరం జీవామృతం డెమో చూపించారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. గ్రామ ప్రజలు, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.



రైతు నర్సింహమూర్తిని సత్కరిస్తున్న దృశ్యం